ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 5 ఏప్రిల్ 2025



పండ్లను కృత్రిమంగా మగ్గించొద్దు: జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పండ్లను కృత్రిమంగా మగ్గించి విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని జేసీ సేతుమాధవన్ హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ మొదటి సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. పండ్లను కృత్రిమంగా మగ్గించడం వల్ల వాటి నాణ్యత దెబ్బతినడంతో పాటు ఆరోగ్యానికి హాని కల్గిస్తాయని చెప్పారు. వాటిని తింటే పెప్టిక్ అల్సర్‌లు, తలనొప్పి , మైకం, ఇతర న్యూరోలాజిక్ సమస్యలు ఎదుర్కోవాల్సి రావొచ్చునన్నారు. సమావేశంలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ సహాయ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి, డీపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిఫారసు ఉంటేనే..!

- బ్యాంకు గ్యారెంటీ, ప్రజాప్రతినిధుల ప్రాపకం కోసం ప్రదక్షిణలు
- బీసీ, ఈడబ్ల్యూసీ కార్పొరేషన్ రుణాల కోసం అగచాట్లు
- ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుండడంతో పెరిగిన పోటీ
- 2883 మంది లబ్దిదారులను గుర్తించాలని లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా ఇంటర్వ్యూలు
- రూ.54 కోట్లు కేటాయింపు

శృంగవరపుకోట, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండలానికి చెందిన ఓ యువకుడు ఐటీఐ వరకు చదువుకుని ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా యంత్రాల విడిభాగాలు విక్రయించే వ్యాపారం చేసుకుంటున్నాడు. 50 శాతం రాయితీ ఇచ్చే బీసీ కార్పొరేషన్ రుణం తీసుకుంటే వ్యాపారం మరింత విస్తరించవచ్చునని దరఖాస్తు చేసుకున్నాడు. ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల జరిగిన ఇంటర్వ్యూకు వెళ్లాడు. తీరా ఇంటర్వ్యూలో ఈ మండల పరిధిలో వున్న బ్యాంకు నుంచి గ్యారెంటీ చూపిస్తేనే దరఖాస్తు పరిశీలిస్తామని అధికారులు చెప్పడంతో తెల్లముఖం వేశాడు. ఇతనికి పక్క మండలం శృంగవరపు కోటలోని ఓ బ్యాంకులో ఖాతా ఉంది. ఆ బ్యాంకు పేరునే దరఖాస్తులో పొందుపరిచాడు. చేసేదిలేక స్థానికంగా వున్న బ్యాంకు అధికారులను కలిసి ఖాతా తెరవడంతో పాటు బీసీ కార్పొరేషన్ రుణం పొందేందుకు గ్యారెంటీ ఇవ్వాలని కోరాడు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో దిగాలు చెందుతున్నాడు. ఈ సమస్య ఆ యువకుడు ఒక్కడిదే కాదు. జిల్లా వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ప్రయత్నిస్తున్న చాలా మంది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇంటర్వ్యూ సమయంలో బ్యాంకు గ్యారెంటీ ఉంటేనే దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఆపై ప్రజాప్రతినిధుల సిఫారసులకు కూడా అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రచారం జరగడంతో వారి ప్రాపకం కోసమూ పాట్లు పడుతున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల దరఖాస్తులపై సంతకాలు పెట్టి ఇంటర్వ్యూలకు పంపించడంతో వీటిని చూసిన మిగిలిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు గ్యారెంటీ, ప్రజాప్రతినిధుల సిఫారసు లేకుంటే రుణం అందేలా లేదని నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు.

- నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా వెనకబడిన తరగతులకు చెందిన యువతతో పాటు అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి (మిగతా 8వ పేజీలో..)



నాయకుల ఒత్తిళ్లు.. అధికారుల అగచాట్లు

మూడు పార్టీలు నేతల మధ్య నలిగిపోతున్న వైనం

మెంటాడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాల జాతర మండల స్థాయి అధికారులకు ప్రాణసంకటంగా పరిణమించింది. టీడీపీ నేతల సిఫార్సులు ఓ వైపు, స్థానిక సంస్థల్లో పవర్లో ఉన్న వైసీపీ నేతల ఒత్తిళ్లు మరోవైపు.. అలానే జనసేన నేతల సిఫార్సుల మధ్య అధికారులు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ఎవరిమాట కాదంటే ఎట్నుంచి ఏమవుతుందోనన్న ఆందోళన వారిలో నెలకొంది. దరఖాస్తుల ప్రక్రియను ముగించిన అధికారులు ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సిఫార్సులకు అతీతంగా ఎంపిక చేయాలని యంత్రాంగం భావించినప్పటికీ వారికి ఒత్తిళ్లు తప్పడం లేదు. ఇంటర్వ్యూ సమయంలో తమ వర్గీయులను ఎంపిక చేయాలని టీడీపీ,వైసీపీ,జనసేన నాయకులు పట్టుబడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 95 శాతం స్థానిక సంస్థలు వైసీపీ ప్రాబల్యంలో ఉన్నాయి. గత లోకల్ బాడీ ఎలక్షన్ టైమ్‌లో అప్పటి అధికార వైసీపీ నయానా భయనా అన్ని స్థానాలను తన ఖాతాలో (మిగతా 8వ పేజీలో..)


సీతారాముల కల్యాణం జరిగే వేదిక ఇదే

కల్యాణం చూతము రారండి

- 6న రామతీర్థంలో సీతారాముల వివాహ వేడుక
- ప్రభుత్వ లాంఛనాలతో జరిపేందుకు ఏర్పాట్లు
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండపల్లి

నెల్లిమర్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రామతీర్థం పుణ్యక్షేత్రంలో ఈ నెల 6న సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2015 నుంచి ఇక్కడ ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ లాంఛనాలతో కల్యాణం జరుగనుంది. కల్యాణానికి ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టువస్త్రాలు అందజేస్తారు. రామతీర్థంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఉగాది నాడు ఘనంగా ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి స్వామివారి సన్నిధిలో ప్రతిరోజూ శ్రీమద్రామయణ, సుందరకాండ పారాయణాలు, దివ్య ప్రబంధ సేవాకాలములు, తులసి, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు.

- ఈ నెల 6న శ్రీరామనవమి పురస్కరించుకుని ఉదయం 10:30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఆ రోజు వేకువజామున 3 గంటలకు ఆరాధన, బాలబోగం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు చేపడతారు. ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించే సీతారాముల కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని, స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ ఈవో శ్రీనివాసరావు కోరారు.

మార్కెట్ కమిటీలకు చైర్మన్లు ఖరారు

- ఒకేరోజు మూడు ఏఎంసీలకు సభ్యుల నియామకం

రాష్ట్ర వ్యాప్తంగా ఏఎంసీలకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ జాబితాలో జిల్లాలో మూడు కమిటీలకు చోటు దక్కింది. పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులకు కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను కేటాయించింది. రాజాం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా జనసేనకు అవకాశం కల్పించింది.

విజయనగరం ఏఎంసీ చైర్మన్‌గా కర్రోతు



విజయనగరంరూరల్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గాజులరేగ ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కర్రోతు నర్సింగరావు పేరు ఖరారు అయ్యింది. నర్సింగరావు టీడీపీ నగర శాఖ అధ్యక్షుడిగా ఉన్నారు. 2014 నుంచి 2019 సమయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశించినప్పటికీ చివరి నిమిషంలో ఆ పదవి సైలాడ త్రినాథ్‌కి దక్కింది. పదవి రాకపోయినా పార్టీ ఆదేశానుసారం కష్టపడి పనిచేశారు. కర్రోతు నర్సింగరావు సతీమణి ప్రస్తుతం కార్పొరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైస్ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించింది. బీజేపీ నుంచి ఒకరికి, జనసేన నుంచి ఒకరికి డైరెక్టర్ల పదవులు దక్కాయి.

గజపతినగరం ఏఎంసీ చైర్మన్‌గా గోపాలరాజు



గజపతినగరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఎఎంసీ) చైర్మన్‌గా పాకలపాటి వెంకట విజయ గోపాలరాజు నియమితులయ్యారు. 1994లో రాజకీయప్రవేశం చేసిన ఈయన 2018లో తెలుగుదేశం పార్టీలోకి వచ్చారు. అప్పటి నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కొండపల్లి కుటుంబానికి విశ్వసనీయ అనుచరునిగా కూడా ఉన్నారు. ముగిసిన ఎన్నికల్లో శ్రీనివాస్ గెలుపు కోసం అహర్నిశలూ పనిచేశారు.

రాజాం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా కృష్ణవేణి



రాజాం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన పొగిరి కృష్ణవేణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం పొత్తులో భాగంగా రాజాం ఏఎంసీని జనసేనకు కేటాయించింది. ఈమె జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు సతీమణి. ఈమెకు ఇద్దరు పిల్లలు. బాబు గౌతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్వహిస్తుండగా పాప దీపిక ఢిల్లీలో సివిల్స్ కోచింగ్‌లో ఉన్నారు. భర్త సురేష్‌బాబు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పవన్‌కళ్యాణ్ ఆశయాలకు మెచ్చి ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. రాజాంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు.

మరిన్ని వాహన చార్జింగ్ స్టేషన్లు

- ఈపీడీసీఎల్ పరిధిలో 10 ఏర్పాటు చేస్తాం: సీఎండీ
- విజయనగరంలో తొలి స్టేషన్ ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పీపీపీ విధానంలో 10 వాహన చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ ఎనర్జీ విధానంలో భాగంగా వీటిని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొస్తోందన్నారు. వీఎస్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థతో కలిసి నగరంలో పాత జిల్లా కోర్టు ఎదురుగా వీటి అగ్రహారం రోడ్డులో ఏర్పాటు చేసిన తొలి విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పది విద్యుత్ చార్జింగ్ స్టేషన్లను పైలట్ విధానంలో తీసుకొస్తున్నామన్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే క్రమంలో రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఐదు వేల విద్యుత్ చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం నిర్దేశించారని, ఇందులో భాగంగానే ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని విద్యుత్ చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వేసవిలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. తమ సంస్థ పరిధిలో ఇప్పటి వరకూ 35 శాతం సర్వీసులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే 90 శాతం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఇంకా మొదలు కాలేదన్నారు. కార్యక్రమంలో తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఫైనాన్స్ డైరెక్టరు టి.చంద్రం, సీజీఎం శ్రీనివాసరావు, ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు, ట్రాన్స్ కో ఎస్ఈ బాలాజీ, ఈఈ పి.త్రినాథరావు, డీఈలు కిరణ్, సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

7 కళాకారులకేదీ ఆనందం?
- ఆనంద గజపతి కళాక్షేత్రాన్ని ముసురుకున్న సమస్యలు
- సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని పాలకులు

ఏవీ ఆ సువాసనలు? 6
- కొండవెలగాడలో తగ్గుతున్న పూల సాగు
- రైతులకు కలిసిరాని వైనం
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు

బొబ్బిలి అన్నా క్యాంటీన్‌కు ఐదో ర్యాంకు 6
- విజయనగరంలోని క్యాంటీన్లకూ ఉత్తమ ప్రశంస
- మరింత మెరుగ్గా నిర్వహించాలి: కలెక్టర్ అంబేడ్కర్

రోడ్డు తెచ్చిన వివాదం 6
- తవ్వేసిన రియల్ ఎస్టేట్ ప్రతినిధులు
- చీడికాడ గ్రామస్థుల ఆందోళన
- మళ్లీ పూడ్చివేయడంతో శాంతించిన వైనం



అమల్లోకి స్లాట్ బుకింగ్

- రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త విధానం ప్రారంభం
- క్రయ విక్రయదారులకు సమయం ఆదా
- పైలట్ ప్రాజెక్టు కింద విజయనగరం ఓఆర్‌బీ కార్యాలయం ఎంపిక
- తొలిరోజు 52 స్లాట్ బుకింగ్‌లు.. 44 రిజిస్ట్రేషన్లు

విజయనగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త విధానం అమల్లోకి వచ్చింది. దళారుల ప్రమేయానికి చెక్ పెట్టడంతో పాటు క్రయవిక్రయదారులకు సమయం ఆదా చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానం శుక్రవారం మొదలైంది. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం గంటలకొద్దీ నిరీక్షించకుండా డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ (డీక్యూఎంఎస్) విధానం దోహదపడనుంది. పాత విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం కొత్తగా స్లాట్ బుకింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద జిల్లా కేంద్రంలోని ఓఆర్‌బీ(ఒరిజినల్ బ్రాంచి) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేశారు. దశలవారీగా మిగతా కార్యాలయాల్లోనూ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు సగటున 250 నుంచి 300 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అయితే ప్రభుత్వానికి ఆదాయం కంటే దళారులు, దస్తావేజు లేఖర్లు ఎక్కువగా ఆదాయం పొందుతున్నారన్నది బహిరంగ రహస్యం. కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు దస్తావేజు లేఖర్లు, దళారులను సొంతంగా (మిగతా 8వ పేజీలో..)

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతోంది. జిల్లా ఓఆర్‌బీ కార్యాలయంలో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ విధానాన్ని పైలట్‌గా ప్రారంభించాం. మొదటి రోజు 52 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. 44 మందికి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. క్రయ విక్రయదారుల అనుకూల సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తాం. ఈ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సమయం ఆదా కావడమే కాకుండా మధ్యవర్తిత్వం ఉండకుండా నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

- పి.రామలక్ష్మి పట్నాయిక్, జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్

ఏవీ.. ఆ సువాసనలు?

- కొండవెలగాడలో తగ్గుతున్న పూల సాగు
- రైతులకు కలిసిరాని వైనం
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు

ఒకప్పుడు ఆ ప్రాంతమంతా పూల సువాసనలే. నేలపై రంగు రంగుల తివాచీలు పరిచినట్టు కనుచూపుమేర పూలతోటలే. కానీ రానురానూ పరిస్థితి మారుతోంది. ఆ సువాసనలు ఇప్పుడు తగ్గుతున్నాయి. పూలమొక్కల వైభవమూ అంతగా కానరావడం లేదు. ఇదీ కొండవెలగాడ పరిస్థితి.

నెల్లిమర్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం పరిసర ప్రాంతాల్లో పూల పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చేది కొండవెలగాడ గ్రామం. అక్కడి రైతులు దశాబ్దాలుగా పూలసాగుపైనే ఆధారపడి వస్తున్నారు. కానీ ఇటీవల కాలంలో మారిన పరిస్థితులతో పూల నుంచి ఇతర పంటల వైపు దృష్టి మరలుస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్న ఆలోచనకు వస్తున్నారు. కొందరు ఇప్పటికే అటువైపు మళ్లారు. పూలకు గిరాకీ ఉన్నప్పటికీ సాగుపై పెట్టుబడి అనూహ్యంగా పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి పెద్దగా సహకారం లేకపోవడం, చీడపీడల మందులు ఫలితాలను ఇవ్వకపోవడంతో రైతులు పూలసాగుకు దూరమవుతున్నారు.

నెల్లిమర్ల మండల కేంద్రానికి సుమారు 4 కిలోమీటర్లు, జిల్లా కేంద్రం విజయనగరానికి కిలోమీటరు దూరంలో ఉన్న కొండవెలగాడ గ్రామం పూల తోటల సాగులో జిల్లాలోనే పేరు పొందింది. గ్రామంలో గులాబీ, మల్లె, బంతి, విరజాజులు, కాగడా, కనకాంబరాలు, చీమబంతి, పుట్టి బంతి, బటన్, సెంపెంగ తదితర రకాలకు చెందిన పూలను సాగుచేస్తారు. వాటిలో సుమారు 70 శాతం పూలను ఎగుమతి చేస్తారు. మిగిలిన 30 శాతం పూలను చిన్న వ్యాపారులు, కూలీలు గ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఈ గ్రామంలో ప్రధానంగా గులాబీ, బంతి, మల్లెపూలను అధికంగా సాగుచేసేవారు. విజయనగరం, చీపురుపల్లి, రాజాం, ఆమదాలవలస ప్రాంతాలకు చెందిన పెద్ద వ్యాపారులు ఇక్కడి రైతులతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుని పూలను కొనుగోలు చేసి ఎగుమతి చేసుకుంటారు. ఆ ప్రాంతాల్లో సీజన్‌ను బట్టి ఒక్కో రకం అమ్ముతుంటారు. గ్రామంలో సుమారు 50 నుంచి 100 మంది చిల్లర వర్తకులు రైతుల వద్ద పూలు కొనుగోలు చేసి ఊరూరా అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ పల్లపు భూముల్లో వరిపంట సాగుచేస్తుండగా మెట్ట ప్రాంతాల్లో పూలసాగును కొనసాగిస్తున్నారు. ఈ పంటకు కావాల్సిన నీటి వనరులు పెద్దగా అందుబాటులో లేకపోవడంతో సమీప నేల బావుల్లో నీటిని అతి కష్టంమీద తోడుకుని పంటను రక్షించుకుంటున్నారు. ఒక్కోసారి పెట్టుబడి కూడా రావడం లేదని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాగుపై విరక్తి కలుగుతోంది



దశాబ్దాల కాలంగా మేం పూల తోటలను సాగుచేస్తున్నాం. ఇది మాకు అలవాటుగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా ఒక్కోసారి రావడం లేదు. పూల తోటల సాగుపై విరక్తి కలుగుతోంది. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెడుతున్నాం.

- వెల్లి రామకృష్ణ,

నకిలీ మందులను నియంత్రించాలి




పూలతోటల సాగులో నకిలి మందులతో నష్టపోతున్నాం. పురుగు మందులు ఏవీ పనిచేయడం లేదు. సొమ్ము వృథా అవుతోంది. నకిలీ మందులపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి వాటిని నియంత్రించాలి.

- కిలారి అప్పలనారాయణ

అందని సాయం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ శాఖ గానీ, ఉద్యానవన శాఖ గానీ రైతులకు సాయం అందిస్తున్న దాఖలాలు లేవు. పూల తోటలకు వివిధ రకాల పురుగులు, వ్యాధులు ఆశిస్తున్న సమయంలో వాటి నియంత్రణ కోసం మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న మందులు వినియోగిస్తున్నారు. అయితే అవి సరిగా పనిచేయడం లేదని రైతులు అంటున్నారు. గతంలో గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో ఈ పూలసాగు చేయగా.. ప్రస్తుతం ఈ విస్తీర్ణం 200 ఎకరాలకు తగ్గిపోయిందని చెబుతున్నారు. భవిష్యత్తులో మరింత తగ్గిపోయే పరిస్థితులు కూడా లేకపోలేదని పూల రైతులు బట్టు లక్ష్మణ, వల్లూరు రాము, మొయిద రామునాయుడు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ ప్రభుత్వ విభాగం నుంచి కనీసం రుణ సదుపాయం కూడా లేదంటున్నారు. రైతులు పూలసాగు చేస్తుంటే.. ఆ పూలను మహిళలు ఇంటి వద్ద దండలు కడుతూ వారికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఇంటిల్లిపాదీ ఈ పంటపై ఆధారడినప్పటికీ... వీటిపై వచ్చే ఆదాయం కేవలం బతకడానికే సరిపోతోందని... లాభాల మాటే లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బంతిపూల తోట

రోడ్డు తెచ్చిన వివాదం

- తవ్వేసిన రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు
- చీడిపాలెం వాసుల ఆందోళన
- మళ్లీ పూడ్చివేయడంతో శాంతించిన జనం

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ చినఖండేపల్లి నుంచి చీడిపాలెం వెళ్లే దారిలో ఒక రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు రోడ్డును తవ్వేయడం వివాదానికి దారి తీసింది. ఇరువైపులా రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పాఠశాల నుంచి పిల్లలను తీసుకొస్తున్న ఆటో నిలిచిపోయింది. ఈ విషయం చీడిపాలెం గ్రామస్థులకు తెలిసింది. దీంతో వారు ఆగ్రహంతో అక్కడికి చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... చీడిపాలెం వెళ్లే రోడ్డును రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు ఉన్నట్టుండి తవ్వేశారు. దీంతో గ్రామస్థులంతా అక్కడికి చేరుకున్నారు. స్థానికులు, యువత సంబంధిత సంస్థ ప్రతినిధులతో వాదనకు దిగారు. చినఖండేపల్లి నుంచి చీడిపాలెం వెళ్లే రోడ్డును ఎవరితోనూ చెప్పకుండా... ఏకంగా తవ్వేయడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిధులతో గడిచిన 40 ఏళ్లలో ఏడుసార్లు ఈ రోడ్డును వేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ రహదారినే తాము రాకపోకలకు వినియోగిస్తున్నామని వివరించారు. అది ప్రభుత్వ స్థలమని చెప్పి... అధికారులు రోడ్డు వేస్తే... ఇప్పుడు లేఅవుట్ వేస్తున్న ప్రతినిధులు తమ సొంత స్థలమని చెప్పడం.. రోడ్డు తవ్వడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఆ సమయంలో గ్రామపెద్దలు చేరుకోవడంతో వెనక్కి తగ్గినరియల్ ఎస్టేట్ సంస్థ సూపర్ వైజర్లు తవ్వకాలు నిలిపేశారు. ఈ విషయమై సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. అది తమ జిరాయితీ స్థలమని చెప్పారు. ప్రభుత్వం రోడ్డు వేసినప్పుడు తమకు తెలియదని అన్నారు. ఈ గ్రామస్థుల కోసం వేరే రోడ్డు వేస్తామని తెలిపారు. రోడ్డు వేస్తున్న స్థలం గంట్యాడ మండల పరిధిలో ఉండటంతో అక్కడి వీఆర్‌వో గణపతి వచ్చి పరిశీలించారు. గిరిజనులు అందోళన చేస్తున్న విషయం తెలియడంతో పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఇంతలో లేఅవుట్ సంస్థ ప్రతినిధులు తవ్విన రోడ్డును మళ్లీ పూడ్చేశారు. దీంతో గ్రామస్థులు శాంతించారు. వివాదం సద్దుమణిగింది.



గిరిజనులు వ్యతిరేకించడంతో తిరిగి రోడ్డు వేస్తున్న దృశ్యం



నిరసన తెలుపుతున్న చీడిపాలెం ప్రజలు

పరిశీలిస్తాం

ఈ విషయమై గంట్యాడ తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. దీన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి.. వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

బొబ్బిలి అన్నా క్యాంటీన్‌కు ఐదో ర్యాంకు

బొబ్బిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా క్యాంటీన్‌కు రుచి, నాణ్యతకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంక్ లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాకు చెందిన మూడు అన్నా క్యాంటీన్లకు మెరుగైన ర్యాంకులు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 205 అన్నాక్యాంటీన్లు ఉండగా.. అందులో 15 క్యాంటీన్లకు మాత్రమే మంచి ర్యాంకులు వచ్చాయి. బొబ్బిలి అన్నా క్యాంటీన్‌కు సంబంధించి మొత్తం 2,034 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారు. వీరిలో 1,995 మంది (98 శాతం) స్థానిక అన్నా క్యాంటీన్ నిర్వహణపై సానుకూలంగా తమ అభిప్రాయాలను చెప్పడం విశేషం. ఇదే ఒరవడిని మున్ముందు కొనసాగిస్తూ మరిన్ని ర్యాంకులు సాధించేందుకు కృషి చేస్తామని అధికారులు వెల్లడించారు.



బొబ్బిలిలోని అన్నా క్యాంటీన్

మరింత మెరుగ్గా నిర్వహణ: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు అన్నా క్యాంటీన్లకు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకులు లభించాయి. దీంతో అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినదించారు. వీటి నిర్వహణను మరింతగా మెరగుపరిచి... ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని, అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని అన్నా క్యాంటీన్లూ నిర్వహణలో ఒకదానితో ఒకటి పోటీ పడి , రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నగరంలోని ప్రకాశం పార్కు క్యాంటీన్ నిర్వహణపై 1,593 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వీరిలో 1,578 మంది (99 శాతం) నుంచి సానుకూల స్పందన లభించింది. ఘోషా ఆసుపత్రి క్యాంటీన్ విషయంలో 1,035 మంది తమ అభిప్రాయాలను తెలియజేయగా, వీరిలో 1017 మంది (98 శాతం) సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కౌన్సిలర్ల సంతకాలు సరైనవే

- బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ స్పష్టీకరణ
- కలెక్టర్‌కు త్వరలో ఆర్డీవో నివేదిక



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం

బొబ్బిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కౌన్సిలర్ల సంతకాల వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు శుక్రవారం పూర్తి చేశారు. మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు (వైసీపీ)పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కలెక్టర్‌కు స్థానిక కౌన్సిలర్లు 20 మంది ఇటీవల ఫారమ్-1ను అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ దీనిపై తగిన చర్యలు తీసుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి అయిన ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామ్మోహనరావుకు కౌన్సిలర్లు సంతకాలు చేసిన ఫారమ్-1ను వెరిఫికేషన్ నిమిత్తం పంపించారు. ఆయన స్థానిక మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మికి ఆ పత్రాలను పంపించారు. కౌన్సిలర్ల సంతకాలు సరైనవా కాదా? అని పరిశీలించాలని ఆదేశించారు. కౌన్సిలర్లు పదవీ స్వీకార ప్రమాణం చేసిన సమయంలో వారు చేసిన సంతకాలతో ప్రస్తుతం ఫారమ్-1 లో గల సంతకాలను పోల్చి చూశారు. ఆ సంతకాలన్నీ సరిపోయినట్లు కమిషనర్ నిర్ధారించి.. ఆర్డీఓకు నివేదించారు.

కలెక్టర్ ఆదేశాలే తరువాయి..

ఈ నివేదికను కలెక్టర్‌కు ఆర్డీఓ సమర్పించనున్నారు. ఈ సంతకాల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఫారమ్-2 ప్రకారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ కోసం కలెక్టర్ ఆదేశాలు ఇవ్వనున్నారు. ఆ మేరకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన చర్చ, ఓటింగ్ వంటి లాంఛనాలు అధికారులు నిర్వహిస్తారు. బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 30 మంది పాలకవర్గ సభ్యులలో పది మంది వైసీపీ, పది మంది టీడీపీ కౌన్సిలర్లు కలిసి మొత్తం 20 మంది ఫారమ్-1లో సంతకాలు చేసి..కలెక్టర్‌కు సమర్పించారు. ఇదిలా ఉండగా వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఛైర్మన్ సావు వర్గానికి చెందిన పది మంది కౌన్సిలర్లు కలిసి చర్చించినట్లు తెలిసింది. బొత్స ఎటువంటి దిశానిర్దేశం చేశారోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

విద్యార్థులపై కేసులను వెనక్కి తీసుకోండి

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, అఖిల్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం ఐటీ కంపెనీ పేరుతో నాశనం చేస్తోందన్నారు. దీనిపై విద్యార్థులు వ్యతిరేకించి ధర్నా చేస్తే వారిపై లాఠీ చార్జీ చేసి, కేసులు పెట్టడం అన్యాయమన్నారు. 400 ఎకరాల భూమినే కాదు వన్యప్రాణులను రక్షించుకోవాలనే లక్ష్యంతో విద్యార్థులు చేసిన నిరసన కార్యక్రమంపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.



మానవహారం చేపట్టిన విద్యార్థులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

దత్తిరాజేరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భూపాలరాజపురంలో శుక్రవారం రామమందిర ప్రారంబోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పూర్ణకుంభాలతో ఆలయానికి చేరుకున్నారు. స్వామి నామ సంకీర్తన చేశారు.

కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు





సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

బొండపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపేటలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ యాదవ్ హాజరయ్యారు.

కళాకారులకేదీ ఆనందం?

● ఆనంద గజపతి కళాక్షేత్రంలో ముసురుకున్న సమస్యలు

● సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని పాలకులు

● ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు

విజయనగరం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): కళలకు, క్రీడలకు, సాంస్కృతిక, సాహితీ రంగాలకు నిలయంగా విజయనగరం భాసిల్లుతోంది. అలాంటి విజయనగరంలో వాటిని ప్రదర్శించేందుకు మంచి వేదిక కరువైంది. నగరం నడిబొడ్డున ఉన్న ఆనంద గజపతి కళాక్షేత్రం పలు సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. ఆనందగజపతి కళాక్షేత్రంలో కార్యక్రమాల నిర్వహణకు అందరూ ముందుకు వస్తారు. అందరికీ అందుబాటులో ఉండటమే కాకుండా వ్యయం కూడా తక్కువ కావడమే కారణం. అందుకే ఈ కళాక్షేత్రానికే ప్రాధాన్యమిస్తుంటారు. ప్రభుత్వ కార్యక్రమాలను సైతం ఇక్కడే నిర్వహిస్తుంటారు.

వేసవిలో కష్టమే..

ఇక్కడి కళాక్షేత్రంలో వర్షాకాలం, శీతాకాలంలో కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులేవీ ఉండవు. వేసవిలో అయితే కష్టమే. ఆ సమయంలో కార్యక్రమాలు నిర్వహించడం నిర్వాకుల సాహసమే అవుతోంది. ఆడిటోరియంలో ఫ్యాన్లు, ఏసీ అలంకారప్రాయంగానే ఉంటాయి. ఉక్కపోత భరించాల్సిందే.

ఎన్నెన్నో సమస్యలు..

ఆడిటోరియంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కళాకారులు మేకప్ వేసుకునే గది నేటి వారి అవసరాలకు తగ్గట్టు లేదు. ఆడిటోరియంలో కుర్చీలు సౌకర్యవంతంగా లేవు. దీనివల్ల నిర్వాహకులు, కార్యక్రమాలకు హాజరయ్యే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో ఒక అధికారికి ఆనంద గజపతి కళాక్షేత్రం అదనపు బాధ్యతలు అప్పగిస్తే మేలనేది నగరవాసుల మాట. ఇకనైనా ఆనంద గజపతి కళాక్షేత్రంలో సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



విజయనగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రమిదే..

'నవమి' నిర్వహణకు ఇరువర్గాల పట్టు

● పెణసాంలో కొనసాగుతున్న వివాదం

గంట్యాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల నిర్వహణ విషయంలో మండలంలోని పెణసాంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఆలయాన్ని తామే నిర్మించామని కొన్ని దశాబ్దాలుగా ప్రథమ పూజ నిర్వహిస్తున్నామని ఒక వర్గం... అధికారంలోకి వచ్చామని తమకే అవకాశం ఇవ్వాలని మరో వర్గం పట్టుపడుతోంది. కొన్ని రోజులుగా సాగుతున్న ఈ వివాదం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లింది. పెణసాంలో ఏటా శ్రీరామనవమి వేడుకులు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కొన్నేళ్లుగా లెంక నారాయణప్పడు కుటుంబీకులు నవమి వేడుకుల్లో ప్రథమ పూజలు నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి వేడుకల్లో వారికి కాకుండా మరొక వర్గం అవకాశం ఇవ్వాలనే కోరడమే ఈ వివాదానికి కారణం. ఇప్పటికే ఇరువర్గాలతో డీఎస్పీ, ఆర్డీవోలు మాట్లాడారు. అయినా సమస్య కొలిక్కిరాలేదు. ఇప్పుడు అందరూ చూపు ఈ గ్రామంపై పడింది. శ్రీరాముడి కల్యాణానికి ఒక్కరోజే గడువు ఉండటంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

అట్రాసిటీ కేసుపై విచారణ

రాజాం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు శుక్రవారం దర్యాప్తు నిర్వహించారు. పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం పూజారి వేమకోటి సూర్యనారాయణ శర్మ, అతని కుటుంబ సభ్యులు తమని కులం పేరుతో దూషించారని అమ్మవారి కాలనీకి చెందిన పక్కి వెంకటన్న దొర, అతడి భార్య మమతా బెనర్జీ రాజాం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దాంతో డీఎస్పీ విచారణ నిర్వహించారు. పలువురి నుంచి వివరాలను సేకరించారు.

రేపు శంకర మఠంలో కల్యాణం

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకరమఠంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు సూర్యనారాయణ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మంగళసూత్రాధారణ, తలంబ్రాలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, రుద్రాభిషేకం, రుద్రహోమం, సహస్ర నామార్చనలు చేపడతామని పేర్కొన్నారు.

7 నుంచి జూట్ మిల్లు నిర్వహణ



మాట్లాడుతున్న గోవిందరావు

నెల్లిమర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని జూట్ మిల్లు ఈ నెల 7 నుంచి పూర్తి స్థాయిలో నడుస్తుందని మిల్లు శ్రామిక సంఘం అధ్యక్షుడు చిక్కాల వెంకట గోవిందరావు అన్నారు. స్థానిక జూట్ మిల్లు ప్రధాన గేటు వద్ద శుక్రవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నార కొరత కారణంగా గత జూన్ నుంచి మిల్లు నిర్వహణ నిలిచిపోయిందన్నారు. 20 రోజుల నిర్వహణ పనులతో మిల్లు తిరిగి తెరచుకుందని ఆయన వివరించారు. మిల్లులో కార్మికులు విధులకు హాజరుకావాలని సూచించారు. సైరన్ శుక్రవారం నుంచి మోగుతుందన్నారు. సోమవారం నుంచి మూడు షిఫ్టులు మిల్లు తిరుగుతుందన్నారు. గతంలో పదవీవిరమణ చేసి అందుకున్న చెక్కులు తిరిగి యాజమాన్యానికి రిటర్న్ చేసిన వారికి సంబంధించి గ్రాట్యుటీ చెల్లింపులకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చేతా అప్పారావు, సముద్రపు సత్యనారాయణ, రెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

గజపతినగరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరానికి అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని డిప్యూటీ డీఈవో మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంతో పాటు మండలంలోని పురిటిపెంటలో ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. కొన్ని పాఠశాలల్లో అవసర మైన పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తా: కళా



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుర్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు సమకూర్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం రూ.1.80 లక్షలతో నిర్మించిన దమరసింగి నుంచి చినమల్లుపేట తారురోడ్డు, రూ.14 లక్షలతో పప్పల తాత ఇంటి నుంచి కేకమ్మ తల్లిగుడి వరకు, మీసాల రాంబాబు ఇంటి నుంచి హైస్కూల్ వరకు నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న పంచాయతీలో కూడా తారు రోడ్డు, తాగునీరు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం, చెరువులు బాగుచేయడం చేస్తున్నామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెన్ని సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజ శ్రేయస్సు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు సమాజానికి మేలు చేస్తాయని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం దాసన్నపేటలోని నివాసంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. స్వామి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి ఉచిత శిబిరాల వల్ల ఎంతో మందికి వైద్య సేవలు అందడమే కాకుండా ప్రాథమికంగా ఆరోగ్య సమస్యలు గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, నాగరాజు, పూసర్ల లక్ష్మి, కాగిత శ్రీనివాస్, దువ్వు రాము, తెలుగు యువత నాయకుడు గంటా రవి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ఆమోదంపై హర్షం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదంపై బీజేపీ జిల్లా కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ మాట్లాడారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదం చారిత్రకమన్నారు. బిల్లు ఆమోదం ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. బిల్లు ఆమోదంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, లక్ష్మీనరసింహం, కుసుమంచి సుబ్బారావు, బిలాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిమెలిసి పనిచేయండి

గుర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కార్యకర్తలు కలిసిమెలసి పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆనందపురంలో బీజేపీ అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు దాసరి ఈశ్వరరావు, కనకరాజు, కొండపల్లి శ్రీనివాసరావు, ఆకుల మహేశ్, వి.చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగానే ఎక్సైజ్ బదిలీలు

● కానిస్టేబుల్,హెడ్ కానిస్టేబుల్ సంఘం ప్రకటన

మెంటాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):ఎక్సైజ్ ప్రొహిబిషన్ విభాగంలో జరిగిన బదిలీల్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ జిల్లా అసోసియేషన్ ప్రకటనలో తెలిపింది. గతేడాది నవంబరు 30న విజయగనరం, పార్వతీపురం జిల్లాలకు సంబంధించి జరిగిన బదిలీల ప్రక్రియ మొత్తం నిష్పక్షపాతంగా జరిగిందని పేర్కొంది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎక్కువ మందిని విజయనగరం డివిజన్‌లోని వివిధ ఎక్సైజ్ స్టేషన్లకు కేటాయింపు జరిగింది తప్ప ఎటువంటి అవకతవకలు జరగలేదని అసోసిఏషన్ ప్రతినిధులు వెల్లడించారు. బదిలీల్లో అన్యాయం జరిగిందని ఎవరూ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలో సారా క్రైమ్ లేని స్టేషన్లలోని సిబ్బందిని పార్వతీపురం జిల్లాలోని స్టేషన్లకు డిప్యూటేషన్‌పై వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్నారన్నారు. ● ఇదిలా ఉండగా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనాథుడు 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్,హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ బదిలీలు పూర్తిగా పారదర్శకంగా జరిగాయన్నారు. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. టి.సన్యాసిరావు, ఎ.ప్రసాద్ గతంలో వారికి కేటాయించిన స్టేషల్లో సుమారు పదేళ్లు పనిచేయడంతో వారిని పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించామని వివరించారు.

సర్వేలో కచ్చితత్వాన్ని పాటించాలి

చీపురుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు, వీవోఏలు కచ్చితత్వాన్ని పాటించాలని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎన్.అప్పలనాయుడు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ



సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామన్నారు. అధికారులు, సిబ్బంది ఇచ్చిన వినతుల్లో వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యలు ఉన్నాయని వాటిని పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

● ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న విద్యార్థినులు

పర్లాకిమిడి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ప్రత్యేకత సాధిస్తున్నారని, రాజకీయ రంగంలో కూడా రాణించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలను తమ సమస్యలుగా భావించి వాటిని పరిష్కరించే దిశలో మహిళలు పాటుపడాలన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. మన జీవితంలో ఎదురైన సమస్యలను పోరాట పటిమతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమెను విద్యార్థినులు సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ ముక్తికాంత మిశ్రా, డాక్టర్ డీఎన్ రావు, డాక్టర్ అనితపాత్రో తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



రోగుల సమస్యను తెలుసుకుంటున్న రాంబాబు

రాజాం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా మేనేజర్ దూబ రాంబాబు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. భోజనం బాగులేదని రోగులు నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో ఉన్న ఆరోగ్యమిత్ర హెల్ప్ డెస్క్ వద్ద రికార్డులను తనిఖీ చేసి రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్ప్ డెస్క్ ఖాళీగా కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన ఫలితాలు తీసుకురండి



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్య అంశాలను శతశాతం అమలు చేసి పురపాలనలో మెరుగైన ఫలితాలు తీసుకురావాలని పురపాలక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్‌కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నగరంలో తాగునీటికి ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్నా క్యాంటీన్‌ల ఔన్నత్యాన్ని మరింత పెంచాలన్నారు. ప్రతిరోజు క్యాంటీన్లను పరిశీలించాలన్నారు. పారిశుధ్యం, ఆహార నాణ్యతను గమనించాలన్నారు. పన్నులు వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన చిన్నారుల నాటిక



నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

జామి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నెయ్యిల వీధిలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అల్లాడ కన్నాంబ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగంపై ప్రదర్శించిన నాటిక.. తల్లిదండ్రులను ఆలోచింపజేసింది. నాటిక ద్వారా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చిన్నారులతో సందేశాత్మక నాటికను ప్రదర్శింపజేసిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

స్థల సంరక్షణకు హామీ



గొయ్యిని పరిశీలిస్తున్న రెవెన్యూసిబ్బంది

రేగిడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్లపాడు రెవెన్యూ ఉంగరాడమెట్ట యాతకాలనీ సమీపంలో కొండ దిగువ స్థలం (గొయ్యి) సంరక్షణకు చర్యలు చేపడతామని తహసీల్దారు చిన్నారావు అన్నారు. 'గొయ్యిపై కన్నేశారు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆర్ఐ రేవతి, వీఆర్వో భవాని, గ్రామ సర్వేయర్‌లతో సంబంధిత స్థలాన్ని పరిశీలన చేయించినట్టు తహసీల్దారు తెలిపారు. సర్వే నెంబరు 5లో దాదాపు 40 సెంట్లు ఖాళీస్థలాన్ని గుర్తించామన్నారు. విలువైన స్థలం కావటంతో భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలు కేటాయించేందుకు దీన్ని సంరక్షిస్తామన్నారు. ఆధారాలు లేకుండా ఎవరికి పట్టాలు రెగ్యులర్ చేసేదిలేదని స్పష్టం చేశారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కుళాయి నుంచి వస్తున్న నీరు

గజపతినగరం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) పురిటిపెంటలో తాగునీటి కష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పురిటిపెంట పంచాయతీ ఈవో శ్రీనివాసరావు షరాబుల కాలనీలో పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించారు. ఇంటింటా కుళాయిల నుంచి నీరు సరఫరా జరిగే ఏర్పాటు చేశారు.

డంపర్ లారీ ఢీకొని ఫార్మా ఉద్యోగి మృతి

●అచ్యుతాపురం జంక్షన్‌లో ఘటన



రమణారావు (ఫైల్)

అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మా కంపెనీ ఉద్యోగి మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి కంపెనీకి వెళుతుండగా అచ్యుతాపురం కూడలిలో ఎలమంచిలి వైపు నుంచి వస్తున్న భారీ డంపర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం గెద్దవలస నరసింహపురం (జీఎన్ పురం) గ్రామానికి చెందిన బగాది రమణారావు (40) పరవాడలో ఫార్మా సిటీ లోని ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలోని బర్మాకాలనీలో నివాసం వుంటున్నాడు. రోజూ బైక్‌పై కంపెనీకి వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరు కావడానికి ఉదయం 5.30 గంటల సమయంలో బైక్‌పై బయలుదేరాడు. దారిలో అచ్యుతాపురం జంక్షన్ వద్ద కుడివైపునకు తిరుగుతుండగా, ఇదే సమయంలో రాంబిల్లి మండలంలోని ఎన్ఏఓబీలో బండరాళ్లను అన్‌లోడ్ చేసి వస్తున్న డంపర్ లారీ, బైక్‌ను ఢీకొన్నది. దీంతో రమణారావు కిందపడిపోయాడు. అక్కడ ఉన్నవారు పెద్దగా కేకలు వేయడంతో డ్రైవర్ డంపర్ లారీని రివర్స్ చేశాడు. ఈ క్రమంలో రమణారావు తల మీద నుంచి ముందు టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ నమ్మి గణేశ్, పోలీసు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

16.1 కిలోల గంజాయి స్వాధీనం

దత్తిరాజేరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి రోడ్డు జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 16.1 కిలోల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. గర్భాం వైపు నుంచి కోమటిపల్లి వైపు ఆటోలో ఐదుగురు వ్యక్తులు 16.1 కిలో గంజాయిని నాలుగు బ్యాగులలో తరలిస్తున్నట్టు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు తప్పించుకునేందుకు యత్నించగా వెంబడించి అదుపులోకి తీసుకు న్నామన్నారు. నిందితుల్లో ముగ్గురు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా కురియలపాడు గ్రామానికి చెందిన జన్ని అప్పన్న, మజ్జి అప్పారావు, జన్ని అప్ప న్న, ఇద్దరు రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లా దాదార్ గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ పురోహిత్, గోపాల్ పురోహిత్‌గా గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు.

గుండెపోటుతో కల్లుగీత కార్మికుడి మృతి



సత్యం (ఫైల్)

గజపతినగరం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బోగాది సత్యం(46) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సత్యం ప్రతిరోజు తాటిచెట్టు ఎక్కి కల్లు గీసేవాడు. ఆ కల్లును అతడి భార్య లక్ష్మి గ్రామానికి చేరువలో అమ్ముతుంది. రోజు మాదిరిగానే సత్యం శుక్రవారం రెండు చెట్టు ఎక్కి కల్లు గీసి తన భార్యకు అప్పగించాడు. మూడో చెట్టు ఎక్కి దిగిన తర్వాత గుండెపోటుకు గురయ్యాడు. విషయాన్ని గమనించిన స్థానికులు సపర్యలు చేసినప్పటికే అతడు మృతిచెందాడు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. సత్యం గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గజపతినగరం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామభద్రపురం గ్రామానికి చెందిన కురుంబిల్లి శ్రీనివాస్ (36)కు గజపతినగరం మండలంలోని కాళంరాజపేట గ్రామానికి చెందిన ఈశ్వరమ్మతో వివాహంతో జరిగింది. టైల్స్ వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావుకు వ్యాపారంలో నష్టం వచ్చింది. అప్పుల భారం ఎక్కువైంది. దీంతో భార్యను తన కన్నవారి ఇంటికి పంపించి ఈనెల 2న మధుపాడ వద్ద గడ్డి మందు తాగాడు. గడ్డి మందు తాగి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందజేశాడు. దీంతో శ్రీనివాసరావును జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఐదు నెలల చిన్నారితో తల్లి అదృశ్యం

చీపురుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల చిన్నారితో మానసిక స్థితి సరిగా లేని ఓ తల్లి అదృశ్యమయ్యింది. ఆమె భర్త డి.రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన జ్యోత్స్నతో రమేష్‌కు పరిచయం ఏర్పడింది. దాంతో జ్యోత్స్న, రమేష్ ఇష్టపడి అక్కడే పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక ఆడపిల్ల కూడా పుట్టింది. బిడ్డ పుట్టిన తరువాత జ్యోత్స్న మానసిక పరిస్థితిలో మార్పు వచ్చింది. హైదరాబాద్‌లో తమ వారంటూ ఎవరూ లేకపోవడంతో బిడ్డను తీసుకుని వారు చీపురుపల్లి చేరుకున్నారు. ఈక్రమంలో గురువారం ఉదయం రమేష్ బాత్‌రూంకు వెళ్లిన సమయంలో జ్యోత్స్న బిడ్డను తీసుకుని బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో సాయంత్రం వరకూ వేచిచూసి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లీబిడ్డల ఆచూకీ తెలిసిన వారు 9121109464, 9121109432కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ దామోదరరావు కోరారు.

గుట్టపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

వేపాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి సమీపంలోని ఓ క్వారీలో గుట్టపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి శుక్రవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన చింతల సత్తిబాబు(54) వీలుపర్తి వద్ద క్వారీలో పనిచేసేందుకు గురువారం వచ్చాడు. గురువారం రాత్రి సత్తిబాబు, అక్కడే పనిచేస్తున్న మాదిరెడ్డి వెంకటరమణ సైట్‌లో నిద్రించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో కాలకృత్యాల నిమిత్తం సత్తిబాబు క్వారీ గుట్టపైకి వెళ్లాడు. అక్కడ నుంచి జారిపడటంతో తల, నుదిటిపై బలమైన గాయాలయ్యాయి. కుడి చెయ్యి విరిగింది. విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి కేసు నమోదు చేశారు.

ఏడుగురు బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు

బొండపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బొండపల్లిలోని ఒక ఇంటిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధాన వ్యక్తులతోపాటు మరో ఐదుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ యు.మహేశ్ తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోటాపోటీగా దుకాణాలకు వేలం పాట

కొత్తవలస, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మేజర్ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 26 దుకాణాల్లో అద్దె ప్రాతిపదికన వ్యాపారాలు చేసుకునేందుకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. వ్యాపారులు పోటీపడి పాట పాడారు. మూడు బ్లాక్‌లుగా 20 షాపులకు, ఉత్తర దిశలోని మరో ఆరు దుకాణాలకు ఈవోపీఆర్డీ శ్రీదేవి, పంచాయతీ ఈవో శైలజ, సర్పంచ్ మచ్చ రామస్వామి ఆధ్వర్యంలో పాటను నిర్వహించారు. బ్లాక్ నెంబరు-1 లోని 5వ దుకాణానికి యడ్ల దేముడుబాబు నెలకు రూ.65,500 అద్దె చెల్లించేందుకు పాట పాడారు. ఇదే బ్లాక్‌లోని 4వ దుకాణానికి రూ.45 వేలకు అమరపల్లి వీరవెంకట సత్యనారాయణ, 8వ దుకాణాన్ని మాలి సురేష్ రూ.43,200 లకు పాడారు. 17వ దుకాణాన్ని పల్లి రామలక్ష్మి రూ.35 వేలకు, 12 దుకాణాన్ని రూ.32,500లకు కె.వరలక్ష్మి, 13వ దుకాణాన్ని కొయ్య భవానీ రూ.31,500, 20వ దుకాణాన్ని బోని శివ రూ.35,500కు పాడుకున్నారు. మిగిలిన షాపులను నెలకు రూ.19 వేల నుంచి 8 వేల వరకు అద్దె చెల్లించే విధంగా వేలం పాటలో పలువురు దక్కించుకున్నారు.

ఘనంగా జేఎన్‌టీయూ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ రాజ్యలక్ష్మి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ గురజాడలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, విశిష్ట అతిథిగా సైంబాలిసిస్ టెక్నాలజీస్ సీఈవో నరేష్‌కుమార్ హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. రాజేశ్వరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, వైఎస్ ప్రిన్సిపాల్ నాగ రాజు, సీనియర్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో..

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రామయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏయూ డీన్ కె.ఈశ్వరకుమార్, హిష్టోరియా ఫార్మా హెచ్‌ఆర్ కమలాకర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. సమాజంలో వైద్యులు, రోగుల మధ్య వారధిగా ఫార్మాసిస్టులు నిలవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఎల్ రాజుతో పాటు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు రామనారాయణంలో కల్యాణోత్సవం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం రామనారాయణంలో ఈనెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఐనాక్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6న ఉదయం 10 గంటలకు రామతారక మంత్రం, సీతారాముల వారికి స్నపనం, 12 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతాయన్నారు. సాయంత్రం 5 గంటలకు రామనారాయణం ప్రాంగణంలో ఘనంగా సీతారాములకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సోమవారం శ్రీరామ పట్టాభిషేకం, ఉంజల్ సేవ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు నీరజవల్లి, చంద్రకళ, దేవాలయ అర్చకులు చాణక్య, పీఆర్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

రూపాయి క్షీణతపై ఉపన్యాసం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా స్వయం ప్రతి పత్తి కళాశాలలో శుక్రవారం వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రూపాయి క్షీణత-కారణాలు-పరిణామాలు అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్ర వర్సిటీ విశ్రాంత ఆచార్యుడు బి.రామకృష్ణారావు హాజరై మాట్లాడారు. ద్రవ్యోల్బణం, వర్తకపు లోటు, పెట్టుబడుల తరలింపు, యూఎస్ డాలర్ బలోపేతం కావడం, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో విదేశీమారకపు ద్రవ్య నిల్వలు కోసం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సాంబ శివరావు, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డా.పి.మధు, సీనియర్ సహాయ ఆచార్యుడు ఎం.శ్రీకాంత్, పైడిరాజు, యామిని భూషణ్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధి ప్రణాళికలు తయారుచేయండి

గరివిడి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై జరుగుతున్న శిక్షణకార్యక్రమాన్ని శుక్రవారం ఏపీడీ కె.సావిత్రి పరిశీలించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు వారి కుటుంబ అవసరాలు, జీవనోపాధుల ద్వారా ఆదాయ అభివృద్ధి కోసం కావాల్సిన పెట్టుబడి, రుణ ప్రణాళిక తయారు చేసుకుని అందుకు తగ్గట్టు రుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం జి.సీతారామయ్య, ఏపీఎం పి.నారాయణరావు, సీసీలు లక్ష్మి, ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై ప్రజలకు వివరించండి



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, తొలగింపు, మార్పులు, బదిలీలు, ఓటరు కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానానికి సంబంధించి విధివిధానాలను ప్రజలకు వివరించాలని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. నెలవారీ సమావేశాలలో భాగంగా ఆయన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు అంశాలపై రాజకీయ పార్టీలకు వివరించారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోగల అన్ని పోలింగ్ బూత్‌లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణకు సంబంధించి రాజకీయ పార్టీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్ఆర్-2025 తుది ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ పూర్తయిందన్నారు. నూతన ఓటర్ల జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు, ప్రతిపాదనలు ఉంటే తెలియజేయాలన్నారు. ఓటరు కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్, టీడీపీ, వైసీపీ మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'వాటర్ బెల్'



విద్యార్థులతో నీరు తాగిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాఠశాలల్లోని విద్యార్థులు కనీసం రోజుకు మూడుసార్లు మంచినీరు తాగేలా వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు పిరిడి ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంట మోగించి, విద్యార్థులతో నీరు తాగించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.


పని ప్రదేశంలో నీటి సౌకర్యం కల్పించాలి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నారాయణప్పవలస గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం త్వరగా పనులకు రావాలని సూచించారు. పని ప్రదేశంలో నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, ఎంసీవో సుధాకర్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కుటిసింది వాన

▸▸ ఉపశమనం పొందిన పార్వతీపురం మన్యం జిల్లా వాసులు

పార్వతీపురం/రూరల్/టౌన్/ వీరఘట్టం/ కొమరాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో జిల్లావాసులు కాస్త ఉపశమనం పొందారు. జిల్లా కేంద్రంతో పాటు సీతానగరం, పార్వతీపురం, జీఎంవలస, వీరఘట్టం తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పార్వతీపురం మండలం కృష్ణపల్లి సమీపంలో ఈదురు గాలులకు రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టు కూలిపోయింది.



వీరఘట్టంలో కురుస్తున్న వర్షం



కొమరాడ: చినఖేర్దిలలో..

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం ఆయన గంగాడ గ్రామంలోని దళితవాడను సందర్శించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని తాగు నీటి సమస్యను అక్కడ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఆ శాఖాధికారులతో మాట్లాడి.. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6లక్షలతో దళి తవాడలో ఇంటింటికి కుళాయిలు వేయాలని ఆదేశించారు. అక్కడి శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రధాన వీధిలో రూ.50లక్షలతో పక్కా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని చెప్పారు. గ్రామంలోని ఎస్సీ వీధిలో వంద గృహాలు ఉన్నప్పటికీ నేటి వరకు పైపులు లేకుండా ఎలా నీరు సరఫరా చేశారని అధికారులపై మండిపడ్డారు. సత్వరమే ఆ వీధికి తాగునీటి సదుపాయం కల్పించాలని ఆయన నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌కు ఆదేశించారు. గ్రామంలోని సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావడంలేదని పలువురు తెలిపారు. దీంతో ఆయన అక్కడే ఉన్న ఎంపీడీవో నగేష్‌తో మాట్లాడి, ఉద్యోగుల పనితీరు బాగోలే కపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ కరుణకుమార్, జేఈ పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.వేణుగోపాలనాయుడు, కొప్పలవెలమ రాష్ట్ర డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, బీసీ సెల్ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహనరావు, నాయకులు గౌరీ శంకరరావు, రాధాకృష్ణ, గౌరునాయుడు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పనిచేయని వారిని పంపించేయండి

● వంతరాం సచివాలయ ఉద్యోగుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

బలిజిపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వంతరాం గ్రామ సచివాలయాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సచివాలయంలో 14 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఆయన ఎంపీడీవో నగేష్‌తో ఫోన్‌లో మాట్లాడి గైర్హాజరైన ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. విధులకు హాజరు కాని వారికి మెమోలు ఇవ్వాలన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు చేపడతామని ఆయన ఎంపీడీవోకు తెలిపారు. పనిచేయని ఉద్యోగులను ఇక్కడ నుంచి వేరొకచోటుకు పంపించేయాలని ఆదేశించారు. ఉద్యోగుల హాజరు పట్టీ అందుబాటులో లేదని, ఉద్యోగుల వారం రోజుల హాజరు వివరాలను తనకు సాయంత్రంలోగా తెలియజేయాలని ఆయన ఎంపీడీవోకు ఆదేశించారు.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని 5వ వార్డు కొత్తవీధి, సాయిరాం కాలనీలతో పాటు 8వ వార్డు పెద్దవీధిలో రూ.11.35 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్వతీపురం మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. అనంతరం పెద్దవీధిలో రచ్చబండ నిర్మాణానికి భూమి పూజ చేసి, టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.రవికుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.జయబాబు, కౌన్సిలర్లు కోలా హేమలత, కోరాడ నారాయణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.వెంకటనాయుడు, నాయకులు కోలా మధు, మంత్రి రవికుమార్ పాల్గొన్నారు.

హైవేల అభివృద్ధికి రూ.9 కోట్లు

బొబ్బిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర హైవేల అభివృద్ధి కోసం రూ.9కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరక యాతన పడేవారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి, రాష్ట్ర వ్యాప్తంగా రూ.860కోట్లతో 20వేల కిలోమీటర్ల రహదారులకు మరమ్మతులు చేశారని ఆయన తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన రహదారులను తీర్చి దిద్దేందుకు సంకల్పించారన్నారు. మరమ్మతులు చేయడానికి వీలులేని విధంగా పూర్తిగా ధ్వంసమైన సుమారు 1432 కిలోమీటర్ల రహదారులను రూ.600కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దీంతో బొబ్బిలి నియోజకవర్గంలోని పలు రహదారులకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

బొబ్బిలి పోలీసుస్టేషన్ పరిధిని మార్పు చేయాలి

బొబ్బిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ, రూరల్ ప్రాంతాలకు సంబంధించి ఒక్కటే పోలీసు స్టేషన్ ఉండడంతో అందరికీ ఇబ్బందికరంగా ఉందని, ఈ స్టేషన్ భౌగోళిక పరిధిని మార్చాలని కోరుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందజేసినట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. పట్టణంలోని 31 వార్డులకు, మండలంలోని 30 పంచాయతీలకు ఒకే పోలీసు స్టేషన్ కావడంతో అటు పోలీసు యంత్రాంగానికి ఇటు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోందని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన స్థానిక విలేకర్లకు తెలిపారు. దీనిపై హోమ్‌మంత్రి సానుకూలంగా స్పందించారని బేబీనాయన తెలిపారు. ఇదే సమస్యను డీజీపీ హరీష్‌కుమార్ గుప్త, ఎస్పీ వకుల్‌జిందాల్‌ల దృష్టికి తీసుకువెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు.



హోంమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రూ.33 కోట్లతో ఉపాధి పనులు

రామభద్రపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 22 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.33 కోట్ల 56 లక్షలతో పనులు మంజూరైనట్టు ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది 1,381 పనులు చేపట్టనున్నామని తెలిపారు. వీటిలో ఫాంపాండ్స్, షోక్‌పిట్స్, కంపోస్టు పిట్స్, కేటిల్ టబ్స్, హార్టీకల్చర్ పనులు చేస్తామని అన్నారు. ఈ ఏడాది మండలంలో 7,452 మంది వేతనదారులతో పనులు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 4,200 మంది పనులు చేస్తున్నారన్నారు.

సిఫారసు ఉంటేనే..!

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందించేందుకు నిర్ణయించింది. ఇలా బ్యాంకుల నుంచి పొందిన రుణంలో 50శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీన్ని లబ్ధిదారులు చెల్లించనవసరం లేదు. మిగిలిన 50 శాతం బ్యాంకులకు వాయిదాల పద్ధతిలో చెల్లించాలి.

● జిల్లా వ్యాప్తంగా 2883 మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యం పెట్టుకున్నారు. రూ.5347.98 లక్షలను రుణాలుగా బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. బ్యాంకుల నుంచి రూ.2673.99 లక్షలు, ఏపీ వెనకబడిన సంక్షేమశాఖ మరో రూ.2673.99 లక్షలను కేటాయించనున్నాయి.

అధిక పోటీ

బీసీ సంక్షేమ శాఖ ఇస్తున్న సొమ్ము పూర్తిగా రాయితీ. రుణం పొందిన లబ్ధిదారుడు తిరిగి చెల్లించనవసరం లేదు. బ్యాంకు నుంచి పొందిన సొమ్మును మాత్రం వ్యాపారం ద్వారా వచ్చే లాభాల నుంచి వాయిదాల పద్ధతిలో బ్యాంకులకు చెల్లించాలి. ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఈవిధంగా ప్రోత్సహించేందుకు మార్చి 10 నుంచి జిల్లాలో దరఖాస్తులు ఆహ్వానించారు. రవాణా వాహనాలు, వ్యవసాయ సంబంధిత పనిముట్లు, ట్రాక్టర్ వంటి వాటితో పాటు జనరిక్ మందుల షాపు పెట్టుకునేందుకూ అవకాశం ఉంది. అలాగే మేదర, కమ్మ, శాలివాహన వంటి సామాజిక వర్గాలకు వృత్తిపరమైన రుణాలను అందించనుండడంతో ఈ రుణాల కోసం యువత బాగానే మొగ్గుచూపింది. 19,616 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.

స్థానిక బ్యాంకుల వద్దకు పరుగులు

స్థానికంగా వున్న బ్యాంకుల వద్దకు నిరుద్యోగ యువత పరిగెత్తుతున్నారు. ఖాతాలను తెరిచి బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని అడుగుతున్నారు. వారి నుంచి సరైన స్పందన ఉండడం లేదు. మరోవైపు బ్యాంకు అధికారులను ఒప్పించి గ్యారెంటీ తీసుకొచ్చే సమయానికి ఎక్కడ రుణాల మంజూరు అర్హత జాబితా తయారు చేసేస్తారోనన్న భయం కూడా వీరిని వెంటాడుతోంది. దీనికి తోడు ప్రజాప్రతినిధుల సిఫార్సుల భయం ఉండనే వుంది. ప్రజాప్రతినిధులు సిఫార్సు ఉన్నా కూడా బ్యాంకు గ్యారెంటీ ఉండాలి. రెండూ ఉన్న లబ్ధిదారులకు మాత్రమే బీసీ కార్పొరేషన్ రుణాలు అందుతాయన్న ప్రచారం జరుగుతోంది.

అమల్లోకి స్లాట్ బుకింగ్

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకుని పర్సంటేజీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అన్ని దస్తావేజులూ సక్రమంగా ఉన్నా పర్సంటేజీలు అందని వాటికి ఉద్దేశపూర్వకంగానే సబ్ రిజిస్ట్రార్లు అడ్డుపుల్ల వేస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. అయితే రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా జరిగే జాప్యాన్ని నియంత్రించాలనే ప్రభుత్వం డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ విధానాన్ని ప్రారంభించింది.

కొత్త విధానం ఇలా..

స్థిరాస్తుల క్రయ విక్రయాలు, వివాహాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ (పీడీఈ) ద్వారా ఏపీ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. రిజిస్ట్రేషన్ చేయాలనుకున్న తమ ఆస్తులు, ఇతర వివరాలు నమోదుచేసుకుని డాక్యుమెంట్లు తయారుచేసుకున్నాక దరఖాస్తు ఐడీ వస్తుంది. దీని ద్వారా స్టాంప్ డ్యూటీ, ఇతర ఫీజులు చెల్లించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమకు అనువైన సమయాన్ని ఎంపిక చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఇది పూర్తయిన వెంటనే వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ టోకెన్ వస్తుంది. అందులో వచ్చిన అపాయింట్‌మెంట్ ప్రకారం నిర్దేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకునే వెసులబాటు కల్పించారు. కాగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్యమాత్రమే దీనికి అవకాశం కల్పించారు. ముందస్తు స్లాట్ బుకింగ్‌కు ఎటువంటి ఫీజు ఉండదు.

నాయకుల ఒత్తిళ్లు.. అధికారుల అగచాట్లు

(5వ పేజీ తరువాయి)

వేసుకుంది. పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు అన్నింటా ఆ పార్టీ అధికారం చెలాయిస్తోంది. ఈనేపథ్యంలోనే ప్రస్తుతం బీసీల రుణాల జాతరలో సింహభాగం తమకే దక్కాలన్నట్టుగా హడావుడి చేస్తున్నారు. తమ వారికే ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇంకోవైపు కూటమి నేతలు సహజంగానే తమవారిని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. ఇలా రెండు అధికార కేంద్రాల మధ్య నలిగిపోతున్నామని అధికారులు వాపోతున్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించండి

బొబ్బిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా లౌకికవాదులంతా నిరసన తెలియజేయాలని సీపీఎం నాయకుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మసీదు దగ్గర ముస్లింలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం కాదని దుయ్యబట్టారు.

● బెలగాం: పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని మసీదు లలో ముస్లింలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ చట్టం ఆస్తుల భూకబ్జాకు తప్ప, వక్ఫ్ ఆస్తుల అభివృద్ధికి కాదని విమర్శించారు. ఈ బిల్లును పార్లమెంట్ లో ప్రతిపక్షాల గట్టిగా ఎదురించినా ఆమోదింపచేశారన్నారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన పార్టీల వైఖరి లౌకికతత్వానికి విఘాతం కలిగించేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణపై అవగాహన అవసరం

పాచిపెంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెట్ల సంరక్షణ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏపీ ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ జానకి అన్నారు. శుక్రవారం ఆలూరు పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు అటవీశాఖ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను ఏ విధంగా కాపాడుకోవాలి, వీటి ఉపయోగాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా చెట్లను కాపాడుకుందాం అని పిలుపునిస్తూ వాటిని కౌగిలించుకున్నారు. నేచ ర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా సాలూరు, పాచిపెం ట మండలాల్లో గల పలు ఉన్నత పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించి విజేతలకు అటవీశాఖ అధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీసీ కోఆర్డినేటర్ డి.ప్రసన్నకుమార్, అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెట్టును కౌగిలించుకుంటున్న విద్యార్థులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్నాథరావు

సాలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సాలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 2025-26 సంవత్సరానికిగాను తీళ్ల జగన్నాథరావును ఎన్నుకున్నారు. శుక్రవారం సాలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బొత్స శ్రీనివాసరావును, జనరల్ సెక్రటరీగా సత్యవరపు శ్రీనివాసరావును, జాయింట్ సెక్రటరీగా నేతవజ్జల భాస్కరరావును, కోశాధికారిగా రావాడ రామకృష్ణ, లైబ్రేరియన్‌గా కోట లక్ష్మణరావును ఎన్నుకున్నట్లు బార్ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి.

న్యూస్ బాక్స్

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం రూరల్, 4 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): నేరేడువలస గ్రామంలోని మహిళలకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బచ్చల దయానంద్ కుట్టుమిషన్లను సమకూర్చగా ఎమ్మెల్యే చేతులమీదుగా వాటిని పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, రమణమూర్తి, సుకేష్ పండా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

సీతానగరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కరుణాకర్, ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని జోగింపేట పంచాయతీలో గృహ నిర్మాణ పనులను వారు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు అందుతాయని చెప్పారు. అలాగే ఎస్సీ బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ జానకిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బోగస్ కుల ధ్రువపత్రాలపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బోగస్ కుల ధ్రువపత్రాలపై గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణ ఎదుర్కొంటున్న వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ఆధారాలు సేకరించి పూర్తి వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విచారణలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, సూపరింటెండెంట్ దేశ్ పాల్గొన్నారు.